క్లుప్తంగా

ఫీవర్ సర్వే తనిఖీ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం పీహెచ్‌సీ పరిధిలోని కాటాయిగూడెం, ములకపాడు గ్రామల్లో జరుగుతున్న రాపిడ్ ఫీవర్ సర్వే ప్రోగ్రామ్‌ను డాక్టర్ పుల్లారెడ్డి తనిఖీ చేశారు. వర్షాకాలం సాధారణంగా వచ్చే వ్యాధులపై ప్రజలకి అవగాహన కల్పించారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నీటి నిల్వలు ఉన్న గుంతల్లో ఆయిల్ బాల్స్‌ను వేయాలని సూచించారు. జ్వరం వచ్చినప్పుడు ఆర్‌ఎంపీలను ఆశ్రయించకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ గంగాధర్ గౌడ్, ఏఎన్‌ఎం లీలాకుమారి, ఆషాలు అరుణ,రమణ తదితరులు పాల్గొన్నారు.

మువ్వాకు అభినందన

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీలో సభ్యుడిగా ఎంపికైన ఉమ్మడి ఖమ్మం మాజీ డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయబాబుకు కాంగ్రెస్ నాయకుడు జారే ఆదినారాయణ అభినందనలు తెలిపారు. మంగళవారం ఖమ్మం పట్టణంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మువ్వా విజయబాబును మర్యాదపూర్వకంగా జారే, అతడి అనుచరులు కలిశారు. మేనిఫెస్టో కమిటీలో సభ్యుడిగా ఎంపికవడంపై అభినందనలు తెలుపుతూ, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కోటగిరి సత్యంబాబు, చిన్నశెట్టి యుగంధర్, కక్కిరాల రమేష్, యర్రగొర్ల రాధాకృష్ణ, పర్వతనేని ప్రసాద్, చామర్తి గోపిశాస్త్రి, శ్రీధర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

దారి సౌకర్యం కల్పించండి

అశ్వాపురం: మండల కేంద్రంలో అశ్వాపురం గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీ గ్రామంలో వైకుంఠదామానికి దారి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అశ్వాపురంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక అలను కలిసి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ శాఖ నక్ష లో ఉన్న దారి ఆక్రమణకు గురైందని రెవెన్యూ అధికారులకు ఎన్నో ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, గ్రామస్తులు ఇసంపల్లి కృష్ణ, రామకృష్ణ, డేవిడ్, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పించాలి

భద్రాచలంటౌన్: ఈ నెల 18 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఏవూరి వెంకటేశ్వర్లు మాదిగ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ చేస్తున్న రిలే నిరాహార దీక్షలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో రమణయ్య, దుర్గాప్రసాద్, ప్రకాష్, రవికుమార్, రాంబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి

మణుగూరురూరల్: రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గడప గడపకు కాంగ్రెస్ పాదయాత్రలో భాగంగా మంగళవారం మణుగూరు మున్సిపాలిటీలోని బాపనకుంట తదితర ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి వరంగల్, హైదరాబాద్, చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన, నిరుపేద ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో పాటుపడిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్లు రద్దు చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఉపాధ్యాయ విద్యా కళాశాలలో అక్రమంగా జరిగిన డిప్యూటేషన్లను రద్దు చేయాలని గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ పీఓ ప్రతీక్ జైన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుభవం ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపడం వల్ల రొంపేడు, కమలాపురం, ఆర్లగూడెం ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల విద్యా సామర్థ్యాలు దెబ్బతింటుదన్నాని పేర్కొన్నారు. అక్రమ డిప్యూటేషన్లపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మానవ హక్కుల జిల్లా అధ్యక్షుడు ముత్తవరపు జానకిరామ్, కాలం సురేష్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఆరోగ్య మహిళ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక కోరారు. ప్రతి మంగళవారం ఎర్రగుంట పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం క్లినిక్‌లో పలువురు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. వర్షాకాలంలో నీరు, క్రిమికీటకాల ద్వారా వచ్చే వ్యాధుల విషయంలో స్త్రీలు, చిన్నపిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీహెచ్ఓ పూలమ్మ, హెచ్ఎస్ నాగేశ్వరరావు, హెచ్‌వీ శారారాణి, ఏఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

‘హరితహారం’పై గొడ్డలి వేటు

- రహదారి వెంట ఏపుగా పెరిగిన చెట్లు
- నరికివేస్తున్న ఇతర శాఖలు
- సమన్వయ లోపంతో సమస్య





నర్సాపురం ప్రధాన రహదారి పక్కన చెట్లను నరికిన దృశ్యాలు

దుమ్ముగూడెం: మొక్కలు నాటడం, వాటిని పెంచడం, తిరిగి నరికేయడం పరిపాటిగా మారింది. క్షేత్రస్థాయిలో వివిధ శాఖల మధ్య సమన్వయం లేమితో హరితహారం లక్ష్యం నీరుగారుతోంది. గొడలివేటుతో పథకానికి తూట్లు పడుతున్నాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతుండడంతోపాటు పర్యావరణ ప్రియులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని నర్సాపురం ప్రధాన రహదారికి ఇరువైపులా పంచాయతీ ఆధ్వర్యంలో చెట్లను నాటారు. అవి మంచిగా ఏపుగా పెరిగి పెద్దయ్యాయి. ఇక్కడి అవెన్యూ ప్లాంటేషన్ చూడముచ్చటగా ఉందనే పేరు ఉంది. అయితే, ఆ మొక్కల పైభాగంలో 33 కేవీ విద్యుత్ లైన్ ఉంది. ఆ తీగలకు మొక్కలు అడ్డు తగులుతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు ఏపుగా పెరిగిన మొక్కల పై భాగాలను నరికేశారు. అప్పటి వరకు పెంచిన మొక్కల కొమ్మలు నేలవాలాయి. తూరుబాక నుంచి పర్ణశాల వరకు ప్రధాన రహదారికి దగ్గర్లోనే ఇరువైపులా అధికారులు మొక్కలను నాటగా.. అవి పెరిగి పెద్దవయ్యే సమయంలో దేనికో ఒక దానికి అడ్డుగా ఉందని మరలా వాటిని ఇలా నరకడం చేస్తుంటారు.

మొక్కలు నాటే సమయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి. కానీ మొక్కలు నాటడమే పరమావధిగా గుడ్డిగా ముందుకు సాగుతున్నారు. మొక్కలు నాటే సమయంలోనే అన్ని శాఖల్లో అధికారులు నిర్ణయం తీసుకోకుండా ఎక్కడ మొక్కలు నాటితే క్షేమంగా ఉంటాయనే విషయాన్ని బేరీజు వేసుకోకుండా నాటారు. విద్యుత్ తీగల కింద నాటొద్దనే అవగాహన లేకుండా మొక్కలేశారు. ఆపై తమకు ఏం సంబంధం లేదనే విధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో లక్షల రూపాయల వృథా అయినట్టైంది. మొక్కలు నాటేముందు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని నాటితే ఇప్పుడు వాటిని నరికే పరిస్థితి వచ్చేది కాదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ మొక్కలను నాటి మమా అనిపించడం వల్లనే ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాటడమెందుకు.. నరకడమెందుకు?



అధికారుల మధ్య సమన్వయం లేక పోవడం వల్ల లక్షల రూపాయాలతో నాటిన మొక్కలను నరికివేతకు గురవుతున్నాయి. మొక్కలు నాటే సమయంలోనే అధికారులు అందరూ సమన్వయ ఆలోచన చేస్తే ఇటువంటి పరిస్థితులు వచ్చేవి కావు. ఆమాత్రం దానికి మొక్కలు నాటడం ఎందుకు మళ్లీ నరకడం ఎందుకు?.

– వీరమాచినేని సునీల్, నర్సాపురం

మొక్కలు ముందే వేశాం..



నర్సాపురం రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ లైన్ కంటే ముందే మొక్కలు నాటాం. గతేడాది వర్షాకాలంలో వచ్చిన గోదావరి వరదలకు స్తంభాలు మొత్తం మునిగాయి. దీంతో విద్యుత్ అధికారులు మరోమారు వరదల సమయంలో విద్యుత్ సమస్య రాకుండా ముంపు ప్రాంతంలోని స్తంభాలను రోడ్డు పక్కకు మార్చారు. దీంతో పెరిగిన చెట్లకు విద్యుత్ లైన్ అడ్డుగా వచ్చాయి.

– ముత్యాలరావు, ఎంపీఓ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక చేయూత

బూర్గంపాడు: అనారోగ్యంతో ఆస్పత్రుల పాలై శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారికి సీఎంఆర్‌ఎఫ్‌తో ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. తాళ్లగొమ్మూరు గ్రామానికి చెందిన మారం లక్ష్మిరెడ్డి, షేక్ ఉస్మాన్‌లకు మంగళవారం ఆమె సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, సోము లక్ష్మీచైతన్యరెడ్డి, బెల్లంకొండ రామారావు,బిట్రా సాయిబాబా, రెడ్డి పోగు రవి, పంగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న జెడ్పీటీసీ శ్రీలత తదితరులు

రక్త నమూనాల సేకరణ



నాగుపల్లిలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యులు

దమ్మపేట: పశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని అంచనా వేసేందుకు పశు వైద్య సిబ్బంది వాటి నుంచి రక్త నమూనాలను మంగళవారం సేకరించారు. మండల పరిధిలోని గణేష్‌పాడు, నాగుపల్లి గ్రామాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా వెటర్నరీ ల్యాబ్ సిబ్బంది ఆధ్వర్యంలో రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా పశు వైద్యుడు మన్యం రమేష్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఆగష్టు 7 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు పశువులకు గాలికుంటు టీకాలు వేశామని, టీకాలతో ఎంత మేరకు వ్యాధి నిరోధక శక్తి పెరిగిందో తెలుసుకోడానికి ప్రస్తుతం 26 పశువుల నుంచి రక్త నమూనాలను సేకరించామని తెలిపారు. అనంతరం పాడి రైతులకు గాలికుంటు టీకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డయాగ్నోస్టిక్ ల్యాబ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అరుణ, ట్రినీ డాక్టర్లు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక

బూర్గంపాడు: బూర్గంపాడు పట్టణ కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం బూర్గంపాడు మార్కెట్‌యార్డులో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందా నాగరాజు రెండోసారి ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దేగల ధర్మయ్య, శెనగ కిషోర్, ఉపాధ్యక్షులుగా చిప్పా రాజు, మడిశెట్టి లక్ష్మణ్, పుట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులుగా గుండె వెంకన్న, ఎస్‌కె.మహబూబ్‌పాషాలతో పాటుగా 20మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, నాయకులు భజన సతీష్, పాశికంటి నాగమురళి, నయూం, కె.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

భద్రాచలంటౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ దేవేందర్, సోమయ్య అన్నారు. భద్రాచలం సబ్ జైల్ ఖైదీలకు ఆయన మంగళవారం టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా టీబీ, హెచ్‌ఐవీ వ్యాధులపై వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షయ, హెచ్‌ఐవీ వ్యాధి లక్షణాలను ఖైదీలకు వివరించారు. క్రమం తప్పకుండా వాడితే వ్యాధులను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. వ్యాధి సోకిన వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం నిక్షయ పోషణ యోజన పథకం ద్వారా మందుల కొనుగోలుకు నెలకు రూ.500 పోషణ భత్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలనుంచి తెమడ శాంపిల్ సేకరించారు. సబ్‌జైలర్ ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కిటకిటలాడిన ముత్యాలమ్మ ఆలయం



మహిళలకు అమ్మవారి తాంబూలం అందజేస్తున్న తెల్లం వెంకట్రావు సతీమణి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం శ్రావణమాసం చివరి మంగళవారం మహిళా భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన మహిళా భక్తులకు అమ్మవారి తాంబూలం పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు. అమ్మవారి తాంబూలం అందుకునేందుకు భారీగా మహిళలు ఆలయానికి తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అమ్మవారిని భద్రాచలం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను చేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్ రెడ్డి, సభ్యులు దల్లి వేణు, ముసలి రాంబాబు, సతీష్ రెడ్డి, కర్రి రవీందర్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు రిపోర్టింగ్ గడువు పెంపు

మణుగూరురూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి రిపోర్టింగ్ గడువును పొడిగించినట్లు మణుగూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ బి.ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో చేరేందుకు గాను ఈ నెల 12వ తేదీన రిపోర్ట్ చేయాల్సి ఉంది. సీటు పొంది అనివార్య కారణాల వల్ల రిపోర్టింగ్ చేయని విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం 14వ తేదీకి గడువు పెంచినట్లు ఆయన తెలిపారు.

లక్ష్మీనగరంలో శానిటేషన్ డ్రైవ్

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఎంపీడీఓ ముత్యాలరావు పర్యవేక్షణలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను మంగళవారం చేపట్టారు. గ్రామంలో రోడ్డుకిరువైపులా పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు మురికి నీటిని తొలగించే పనులను చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనూష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

టైలరింగ్ చార్జీలకు వితరణ

భద్రాచలంటౌన్: పట్టణంలోని నన్నపనేని ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందజేసే యూనిఫాం టైలరింగ్ చార్జీలను మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం, లయన్స్ సమర్పణ క్లబ్ కొత్తగూడెం సహకారంతో రూ.5,600 పాఠశాల ప్రధానోపాధ్యాయురానికి అందజేశారు. కార్యక్రమంలో భద్రాచలం క్లబ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి శరత్, రాజ్యలక్ష్మి, భరత్‌కుమార్, సునీల్‌కాంత్, నరసింహాచారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీవీకాలనీలో ఉన్న కమ్యూనిటీహాల్‌లో ఈ నెల 15వ తేదీన ఉదయం 11గంటలకు కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్-కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో నిర్వహించే పెన్షన్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ మాజీ కార్మికులకు సూచించారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ.. ఏరియాలో పని చేసిన మాజీ సింగరేణి ఉద్యోగులు పొందుతున్న పెన్షన్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు, అభ్యంతరాలు ఉన్నట్లయితే పెన్షన్ అదాలత్‌కు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరై పరిష్కరించుకోవాలని తెలిపారు.

టీడీపీ నాయకుల పూజలు

మణుగూరురూరల్: మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు జైలు నుంచి త్వరగా బెయిల్‌పై బయటికి రావాలని ఆకాంక్షిస్తూ టీడీపీ నాయకులు ప్రార్థించారు. మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పూజలు చేయగా, నాయకులు చందా మధు, బచ్చల భారతి, పసునూరి సీత, ఖమరున్నీసాబేగం, చావా శ్రీదేవి, పురిటి విజయలక్ష్మి, మేదరమెట్ల శ్రీనివాసరావు, పసునూరి కృష్ణ, చావా రామారావు, శంకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

మణుగూరురూరల్: వినాయకచవితి, మిలాద్ ఉన్ నబి పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు సూచించారు. మంగళవారం స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో ఆయన ఉత్సవ కమిటీల నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జన సమయాల్లో డీజేలకు అనుమతి లేదని, మద్యం సేవించి మండపాల వద్ద ప్రజాశాంతికి భంగం కలిగించొద్దని అన్నారు. వినాయకుడిని ప్రతిష్ఠించే మండపం వద్ద తప్పనిసరిగా నిర్వాహణ బాధ్యులు ఉండాలని సూచించారు. మైక్, విద్యుత్ అనుమతులను ఆయా శాఖల ద్వారా తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సీఐ బాలాజీ వరప్రసాద్, పోలీస్ సిబ్బంది, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవేంద్రరావు

గ్రామాల్లో వైద్యశిబిరాలు

మణుగూరురూరల్: మండల పరిధిలోని కొత్తమల్లేపల్లి, అయోధ్యనగర్, ఎస్టీకాలనీ, బాంబేకాలని, ఆదర్శనగర్, జయశంకర్‌నగర్ గ్రామాలలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో పీహెచ్‌సీ డాక్టర్ అనూష ఆయా గ్రామాల ప్రజలకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. పలువురు జ్వరపీడితుల రక్తనమూనాలను సేకరించి జాగ్రత్తలు సూచించారు. వీధుల వెంట బ్లీచింగ్, నీటి నిల్వ ప్రాంతాల్లో యాంటీ లార్వా చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్,రాధ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: మండలంలోని బాలికుంట గ్రామంలో చండ్రుగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ వెంకటప్రకాష్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించారు. రక్త నమూనాలను సేకరించారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో సూపర్‌వైజర్ యండి.ఇమాం, పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.



చండ్రుగొండ: బాలికుంటలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటప్రకాష్

పెరిక కార్పొరేషన్ సాధన సమితి వైస్ చైర్మన్‌గా ‘బుడగం’

భద్రాచలం: ‘పెరిక కుల (పురగిరి క్షత్రియ)’ కార్పొరేషన్ సాధన సమితి వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి చైర్మన్ ముత్తినేని వీరయ్య ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. ఈ సందర్భంగా బుడగం శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా కార్పొరేషన్ సాధనకు కృషి చేస్తానని తెలిపారు. పేద వర్గాలకు ఆర్థిక చేయూత, ఇతర వసతులు కార్పొరేషన్ ద్వారానే సాధ్యమని, దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తానని అన్నారు.



బుడగం శ్రీనివాస్

ఫారెస్ట్ రేంజర్‌గా బాధ్యతలు స్వీకరణ



రేంజర్‌గా బాధ్యతలు తీసుకుంటున్న ఎల్లయ్య

చండ్రుగొండ: చండ్రుగొండ ఫారెస్టు రేంజర్‌గా ఎల్లయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్‌గా ఉన్న జూలూరుపాడు రేంజ్ అధికారి ప్రసాదరావు నుంచి ఆయన చార్జ్ తీసుకున్నారు. కరీంనగర్ ఫ్లెయింగ్‌స్కాడ్‌లో పనిచేస్తున్న ఎల్లయ్య బదిలీపై ఇక్కడకు వచ్చారు. 2022 ఏడాది నవంబర్ నెల 22న విధుల్లో ఉన్న అప్పటి రేంజర్ చలమల శ్రీనివాసరావును ఇద్దరు గొత్తికోయలు హతమార్చిన సంఘటన విధితమే. దీంతో అప్పటి నుండి జూలూరుపాడు రేంజర్ ప్రసాదరావు ఇన్‌చార్జ్ రేంజర్‌గా వ్యవహరిస్తున్నారు.

జయప్రదం చేయండి

మణుగూరురూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతున్న ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా నాయకుడు ఎం.నాగేశ్వరరావు, ఏరియా నాయకుడు మంగీలాల్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం ఏరియాలోని కేసీహెచ్‌పీ, కూనవరం రైల్వే అడ్డాలలో ఆందోళన కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సాధనపల్లి రవి, కాంట్రాక్ట్ కార్మికులు గురుమూర్తి, రవికుమార్, నాగేశ్వరరావు, వీరరాజు, శంకర్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడి మృతి

బూర్గంపాడు: సారపాకలోని గాంధీనగర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చుక్కపల్లి గోపాలరావు (74) మృతి చెందారు. గతకొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఏనుగుల వెంకటరెడ్డి, భూక్యా సీతారామ్‌నాయక్,గుగులోత్ బాలునాయక్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

సాయి మృతి తీరని లోటు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీ జిల్లా నాయకుడు బళ్లా సాయి కుమార్ మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం ఆయన సాయి మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. అనంతరం నిర్వహించిన అంతిమ యాత్రలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.షాబీర్ పాషా, రావులపల్లి రాంప్రసాద్, కల్లూరి వెంకటేశ్వర్లు, తమ్మళ్ల వెంకటేశ్వర్లు, సునీల్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ జేఏసీ సమావేశం

భద్రాచలంటౌన్: పట్టణంలో భద్రాచలం, బూర్గంపాడు ఆటో యూనియన్‌లు జేఏసీగా ఏర్పాటై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేఏసీ అధ్యక్షుడిగా ఎండి.అమీర్ పాషా, సెక్రెటరీగా దుపాటి శివ, గౌరవ అధ్యక్షుడిగా నారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జేఏసీ అధ్యక్షుడు అమీర్ పాషా మాట్లాడుతూ.. ఆటో యూనియన్ సభ్యుల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసి యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆటో ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరసనలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. నియోజకవర్గాల్లోని పలు చోట్ల సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో ప్రదర్శనలు చేపట్టి సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని విమర్శించారు. సమ్మె ఎఫెక్ట్‌తో దాదాపు 90శాతం కేంద్రాలు మూతపడ్డాయని అన్నారు. సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, టీడీపీ నాయకులు సమ్మె శిబిరాలను సందర్శించి తమ మద్దతు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: లక్ష్మీనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు



భద్రాచలంటౌన్: దీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న మచ్చా వెంకటేశ్వర్లు



గుండాల: మండల కేంద్రంలో ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు